






# 'ఛాంబర్ ఎన్నికల్లో' జీవై నరేష్ మార్క్ షురూ

వనం నాగయ్య, కెరటం న్యూస్ ప్రతినిధి

## అత్యంత పిన్న వయసులో ప్రధానకార్యదర్శిగా సంచలన విజయం

ప్రతిష్టాత్మకంగా జరిగిన ఖమ్మం ఛాంబర్ ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేనవి విధంగా అత్యంత తక్కువ వయసులోనే ప్రధాన కార్యదర్శి పదవిని దక్కించుకోవడంతో జీవై నరేష్ సరికొత్త రికార్డును సృష్టించినట్టు ఆయన ప్యానల్ వర్గీయులు కొనియాడుతున్నారు. ప్రధాన కార్యదర్శి పదవికి సీనియర్‌గా ఉన్న గొడవర్తిని ఢీకొనడంతో పాటు సంచలన విజయాన్ని నమోదు చేయడం పట్ల జీవైనరేష్ ప్యానల్ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా ప్రధానమైన అధ్యక్ష స్ధానంలో తమ ప్యానల్ అభ్యర్థి మేళ్లచెరువు వెంకటేశ్వరరావు అనూహ్యంగా ఓటమి చెందడంతో ప్యానల్ కీలకమైన మూడు పదవులను దక్కించుకోవడంతో మేళ్లచెరువు, జీవై నరేష్ ప్యానల్ విజయం సాధించిందన్న చర్చ జరుగుతోంది. తాజా మాజీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న మెంతుల శ్రీశైలం, బత్తుల నర్సింహారావు, కోశాధ్యక్ష పదవికి తల్లాడ రమేష్ సైతం ఇదే ప్యానల్‌నుండి విజయం సాధించడం ప్యానల్‌కు బలం చేకూర్చిందనే వాదన వినిపిస్తోంది. ఆదివారం అర్ధరాత్రి వరకూ జరిగిన ఎన్నికల కౌంటింగ్‌లో తుది ఫలితాలు వెల్లడయ్యే వరకూ మేళ్లచెరవు, జీవై నరేష్ ప్యానల్ మరో వైపు



కురువెళ్ల, గుడవర్తి ప్యానల్‌కు చెందిన కార్యకర్తలు, ఓటర్లు ఉత్కంఠగా వేచి చూశారు. అనంతరం ఫైనల్ రిజల్ట్ రాగానే బాణాసంచా కాల్చి పెద్ద ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి...

ఖమ్మం ఛాంబర్ అఫ్ కామర్స్ అధ్యక్షునిగా కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ ఎన్నికయ్యారు. తన సమీప ప్రత్యర్థి మేళ్లచెరువు వెంకటేశ్వరరావుపై భారీ విజయం సాధించారు. కురువెళ్లకు 725 ఓట్లు పోల్‌కాగా, మేళ్లచెరువు వెంకటేశ్వరరావుకు 506 ఓట్లు పోలయ్యాయి. కురువెళ్ల ప్రవీణ్‌కుమార్ 219ఓట్ల మెజారిటీతో ఘన విజయం సాధించారు. ఇండిపెండెంట్‌లుగా బరిలో దిగిన కొప్పుల కోటేశ్వరరావుకు 21, కొదుమూరి మధుసూధన్‌రావుకు 27 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన కార్యదర్శి పదవకి పోటీ చేసిన రెండు ప్రధాన ప్యానెళ్ల అభ్యర్థుల్లో గొడవర్తి శ్రీనివాసరావుకు 597 ఓట్లు పోల్‌కాగా, సోమా నర్సింహారావు(జీవై నరేష్)కు 683 ఓట్లు పోలయ్యాయి. జీవై నరేష్ తన ప్రత్యర్థి గొడవర్తిపై 86 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవికి గాను పోటీ పడిన రెండు ప్యానెల్ సభ్యుల్లో కురువెళ్ల లక్ష్మీకాంతరావుకు 604 ఓట్లు రాగా బత్తిని నర్సింహారావు 671 ఓట్లు పోలయ్యాయి. మేళ్లచెరువు, జీవై ప్యానల్‌కు చెందిన బత్తిని నర్సింహరావు(బీఎన్) తన సమీప ప్రత్యర్థిపై 67 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. సహాయ కార్యదర్శి పదవికి గాను బాదె రమేష్(రవి)కి 694 ఓట్లు రాగా ముత్యం ఉప్పల రావుకు 579 ఓట్లు పోలయ్యాయి. కురువెళ్ల, గొడవర్తి ప్యానెల్ కు చెందిన బాదె రమేష్ తన ప్రత్యర్థిపై 115 ఓట్ల భారీ మెజారిటీతో విజయం సాధించారు. కోశాధ్యక్షులు పదవికి గాను కైలాసపు వేణుగోపాలరావుకు 78 ఓట్లు, తల్లాడ రమేష్‌కు 606 ఓట్లు, తూములూరి లక్ష్మీనర్సింహారావుకు 586 ఓట్లు పోలయ్యాయి. త్రిముఖంగా జరిగిన ఈ పోరులో మేళ్లచెరువు, జీవై నరేష్ ప్యానల్‌కు చెందిన ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తల్లాడ రమేష్ తన సమీప ప్రత్యర్థిపై 20 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఛాంబర్ ఎన్నికల్లో అత్యంత కీలకమైన దిగుమతి శాఖకు జరిగిన ఎన్నికల్లో కొలేటి నవీన్ కుమార్(ఆర్ఎంఆర్)కు 207 ఓట్లు పోల్‌కాగా వద్దె వెంకటేశ్వర్లుకు 303 ఓట్లు పోలయ్యాయి. సోమిశెట్టి వెంకటేశ్వరావుకు 18 ఓట్లు పోల్ అయ్యాయి. ఈ పోరులో కురువెళ్ల, గొడవర్తి ప్యానల్‌కు చెందిన వద్దె వెంకటేశ్వర్లు తన సమీప ప్రత్యర్థిపై 96 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. దిగుమతి శాఖ కార్యదర్శి పదవికి జరిగిన ఎన్నికల్లో ఆత్మకూరి వెంకటరామారావు కు 83 ఓట్లు రాగా, ఎర్ర అప్పారావుకు 224 ఓట్లు, సోమారపు సుధీర్‌కుమార్‌కు 222 ఓట్లు పోలయ్యాయి. హెూరాహెూరీగా జరిగిన ఈ పోరులో ఎర్ర అప్పారావు తన సమీప ప్రత్యర్థిపై రెండు ఓట్లు తేడాతో సంచలన విజయం నమోదు చేసుకున్నారు. మిర్చి శాఖకు జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా బండారు వీరబాబుపై మెంతుల శ్రీశైలం 18 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మిర్చి శాఖ కార్యదర్శి పోరులో ఎడవల్లి సతీష్‌కుమార్ తన సమీప ప్రత్యర్థిపై 13 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. మిర్చి శాఖ ఈసీ ఎన్నికల్లో పర్వత నరేంద్ర కుమార్‌కు73 ఓట్లు రాగా, జాలాది రవికిరణ్‌కు 43 ఓట్లు పోలయ్యాయి.